క్లుప్తంగా

నేడు కంటి పరీక్షలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం (నేడు) కంటి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన ఐ కేర్ ఆప్టికల్స్ వారి ఆధ్వర్యంలో హనుమకొండకు చెందిన శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వారి సహకారంతో విద్యార్థులకు కంటి, ఆరోగ్య పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ల జోడును ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26న రక్తదాన శిబిరం

ములుగు రూరల్: కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 26న రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రాణదానం చేసే అవకాశమని అన్నారు. ఉదయం 8.30 ఉదయం నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

బురదలో ఇరుక్కున్న క్రేన్



ఏటూరునాగారం: మండలంలోని కొండాయి వద్ద ఐరన్‌బ్రిడ్జిని అమర్చేందుకు వచ్చిన క్రేన్ ఊరట్టం మేడారం వైపు వెళ్లే కొంగ్రేడు వద్ద మంగళవారం బురదలో ఇరుక్కుపోయింది. కొండాయి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను నిలిపివేశారు. దీంతో చేసేది ఏమిలేక క్రేన్‌ను వెనక్కు పంపించి వేస్తున్నారు. దీంతో వెళ్తున్న క్రమంలో దిగబడడంతో క్రేన్‌ను బయటకు తీసేందుకు నరకయాతన పడ్డారు. అంతే కాకుండా రోడ్డుకు అడ్డుగా ఉండడంతో మరింత ఇబ్బందులు ఎదురయ్యాయి.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



రేగొండ: హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఎస్సై రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘం ఉపాధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ.. సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకి మండలంలోని ఫొటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యాక్రమంలో మండల ఫొటోగ్రాఫర్లు శంకర్, సురేందర్, రఘుపతి, రాకేష్, వెంకటేష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

టేకుమట్ల: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పంగిడిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం గీతా కార్మికుడు మాచర్ల రవీందర్‌గౌడ్ రోజువారిలాగే తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో చెతికి తీవ్ర గాయాలై విరిగినట్లు తెలిపారు. కాగా చికిత్స కోసం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, రవీందర్‌గౌడ్ చేయి విరగడంతో ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏడ్జర్లపల్లి గ్రామ రైతు బద్ది సమ్మయ్యకు చెందిన దుక్కిటెద్దు మేత కోసం వెళ్లగా ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో మేస్తున్న క్రమంలో సపోర్ట్ వైర్ తగిలి షాక్ గురై మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ రూ.30 వేలు ఉంటుందని తెలిపారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ



వాజేడు: గర్భిణిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): వానాకాలం సీజన్‌లో కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామచంద్రాపురం, నూగూరు, చర్పిపేట గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుండి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, సిబ్బంది మనోహర్, యాకలక్ష్మి, రామకృష్ణ, భూపతి, వీరలక్ష్మి, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

ధర్మవరంలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో మంగళవారం మొబైల్ వైద్యాధికారిని యోషిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులను పరీక్షించి మందులను అందించారు. బాలింతలకు పరీక్షలు చేసి మందులను ఇవ్వడంతో పాటు పలు సూచనలను చేశారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: ఇప్పటి వరకు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని రైతులు, 2024 జూన్ 28 వరకు పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన రైతులు ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. గతంలో బీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు, చేర్పులు ఆధార్‌లో మార్పులు, నామిని చనిపోతే మార్పుల కోసం మాత్రం జూలై 30లోపు చేసుకోవాలన్నారు. కొత్తగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు మాత్రమే రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫాం, రైతు పట్టాదారు పాసుపుస్తకం, రైతు ఆదార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లు ఇవ్వాలన్నారు. ఆదార్ కార్డులో 18 సంవత్సరాలు నుంచి 59 వయస్సు ఉన్న రైతులకు ఈ బీమా వర్తిస్తుందన్నారు.

ఐటీడీఏ పరిపాలన అధికారిగా రాంబాబు



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ పరిపాలన అధికారి (ఏఓ)గా సున్నం రాంబాబు నియమితులయ్యారు. మంగళవారం ఆయన ఏఓగా బాధ్యతలను స్వీకరించారు. గతంలో పనిచేసిన దామోదరస్వామిని ఉట్నూర్ ఐటీడీఏకు బదిలీ కగా అక్కడ పనిచేస్తున్న రాంబాబును ఇక్కడికి బదిలీ చేశారు. ఆయనను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలోని వాడగూడెం గ్రామానికి చెందిన జాడి సురేంద్ర అనే విద్యార్థి గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించి మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. కాగా ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణబాబు ఆదేశాల మేరకు పార్టీ ఆధ్వర్యంలో కాకులమర్రి ప్రదీప్ రూ.ముప్పై వేలను విద్యార్థికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొడవర్తి నరసింహమూర్తి, గంపా రాంబాబు, వేల్పూరి లక్ష్మీనారాయణ, ముదుంబా శ్రీనివాస్, జాగర శాంతమూర్తి యాదవ్, గడ్డం వివేక్, జాగర శివాజీ తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: వెంకటపురం(కె) మండలం వాడగూడేనికి చెందిన జాడి సురేందర్ గ్రూపు–1 ప్రిలిమ్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. పైచదువుల కోసం ఆర్థిక స్థోమత లేదని వాట్సాప్ గ్రూపులో దాతలు సాయం చేయాలని కోరగా ముప్పనపల్లి సహాయ నిధి గ్రూపు ప్రొడ్యూసర్ అబ్బు సతీష్ స్పందించి పదివేల రూపాయలను సభ్యుల సహకారంతో ఎస్సై ఇనుగుల వెంకటేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పూజరి కిషోర్, కావిరి సంతోష్, సుమన్, పంతంగి నాగరాజు, షాయక్ పాషా, విజయ్, కిరణ్, రాజు, మోహన్, రాజశాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఇసుక లారీ

వాజేడు: మండల పరిధిలోని అరూణాచలపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యన మంగళవారం ఆటోను ఇసుక లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బాగా దెబ్బతినగా ఆటో డ్రైవర్ సతీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో డ్రైవర్ ఒక్కడే ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసులు ఇసుక లారీని వాజేడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దిగబడిన లారీ.. ట్రాఫిక్ అంతరాయం



బోదాపురం వద్ద రోడ్డు పై దిగబడిన లారీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బోదాపురం గామ శివారుల్లో మంగళవారం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఇసుక లారీ దిగబడడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. లారీ రోడ్డుపై కంకరలో కూరుకుపోవటంతో మండల కేంద్రం నుంచి చర్లకు వెళ్లే వాహనాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. దిగబడిన లారీని బయటకు తీయటంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

గంజాయి అమ్మకాలు చేపడితే చర్యలు



గంజాయి కేసులో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: గంజాయి అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గతంలో గంజాయి కేసులో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి అమ్మినా, సరఫరా చేసిన పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గంజాయి మత్తు భారీన పడి యువత చేదు దారిన పడుతుందన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ నారాయణరావు

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని రంగయ్యపల్లి, జగ్గయ్యపేట గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నిల్వ నీటిని తొలగించడంతో పాటు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాని అధికారులకు సూచించారు.

బ్రిడ్జి పనులు వేగవంతంగా చేపట్టాలి

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద ఏర్పాటుచేసిన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేసిన రోడ్డును మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు పరిశీలించారు. బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ రాంప్రసాద రావు, పంచాయతీ కార్యదర్శులు గోపాలక్రిష్ణ, స్రవంతి, జీవిత ఉన్నారు.

సెల్‌ఫోన్లు దొరికితే అప్పగించాలి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లతో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సైలు

కాటారం: ఎవరికైనా ఇతరుల సెల్‌ఫోన్లు దొరికితే అందుబాటులో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాటారం సబ్‌డివిజన్ పరిధిలో సెల్‌ఫోన్లు పొగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ సాంకేతికను ఉపయోగించి 29 సెల్‌ఫోన్లను సేకరించి వారికి అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు ఒరిజినల్ బిల్లు, ఆధార్‌కార్డు, పోగొట్టుకున్న తేదీ, వివరాలతో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కానీ ఆన్‌లైన్ సెంటర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రత్యేక సాంకేతికను ఉపయోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైన సెకెండ్ హ్యాండ్ మొబైల్స్ కొనుగోలు చేసినట్లయితే వాటికి సంబంధించిన ఒరిజినల్ బిల్లు, బాక్స్ ఉంటేనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. మొబైల్‌షాప్ యజమానుల దగ్గరికి ఎవరైన సెల్‌ఫోన్‌లు అన్‌లాక్ చేయమని వస్తే ఒరిజినల్ బిల్లు, బాక్స్ ఉంటేనే అన్‌లాక్ చేయాలని అవి లేకుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. బాధితులు పోగొట్టుకున్న ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ సాంకేతికతను ఉపయోగించి సేకరించిన కానిస్టేబుల్స్ ధనుంజయ్, ఐటీ కోర్ కానిస్టేబుల్ వేణు, ఆయా పోలీస్‌స్టేషన్‌ల పోర్టల్ ఇన్‌చార్జ్‌లు స్వాతి, సింధు, శిరీష, మాషుక్, రమేశ్, అరుణ్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సైలు మ్యాక అభినవ్, మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.

‘స్మితా సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలి’

కాటారం: దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్య లు చేసిన ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాచర్ల వంశీకృష్ణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల రిజర్వేషన్ ఎందుకు అంటూ ట్విట్టర్‌లో దివ్యాంగులను అవమానపర్చేలా సిత్మా సబర్వాల్ వెకిలిరాతలు రాయడం సరికాదన్నారు. ఒక గౌరవప్రదమైన ఐఏఎస్ స్థానంలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని ఆమె వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పి వ్యాఖ్యలనె వెనక్కి తీసుకోవాలని అన్నారు. దివ్యాంగుల చట్టం 2016 యాక్ట్ ప్రకారం స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తగ్గుతున్న గోదావరి వరద



పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి వరద

వాజేడు: మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రం 7 గంటలకు 17.30 మీటర్లకు చేరుకున్న గోదావరి వరద మంగళవారం సాయంత్రానికి 16.10 మీటర్ల మేర తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు తగ్గడంతో గోదావరి వరద వేగంగా తగ్గుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. నాగారం, గుమ్మడిదొడ్డి పునరావాస కేంద్రాల్లో ఉన్న 29 మంది నిర్వాసితులను గోదావరి వరద తగ్గుతుండటంతో అధికారులు వైద్య పరీక్షలను నిర్వహించి ఇళ్లకు పంపించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

ములుగు: పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను అరికట్టి ఆరోగ్యంగా ఉండగలుగుతామని డాక్టర్ పోరిక రవీందర్ అన్నారు. మంగళవారం మాధవరావుపల్లిలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. దోమలు నివసించే ప్రదేశాలను పరిశీలించి, వాటి బారిన పడకుండా కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భూపాలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని తెలిపినట్లు పేర్కొన్నారు. అలాగే గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రూ.రెండు లక్షలను అకౌంట్లోకి వేస్తామని హామీ ఇచ్చి వారిని మోసం చేశారన్నారు. పార్టీ నాయకులు కంబాల రాజయ్య, మాచనివేని రవీందర్, కంచం నరసింహమూర్తి, శంకర్, తోటబడెలు, కరివేద మనోహర్, పొన్నం శ్రీను, వట్టం తిరుపతి, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అభ్యర్థనల పరిశీలన



ఉపాధ్యాయుల అభ్యర్థనను పరిశీలిస్తున్న డీఈఓ

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీఓ 317లోని ఉపాధ్యాయుల అభ్యర్థనలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలన ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అభ్యర్థనల పరిశీలన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికత ఆధారిత కేటగిరి, భార్యాభర్తల (స్పౌస్) కేటగిరీ, దివ్యాంగుల కేటగిరీ, వైద్య ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రతీ మండలానికి ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, ఒక సహాయక ఉపాధ్యాయుడిని నియమించి మండలాల వారీగా జీఓ 317లోని ఉపాధ్యాయుల అభ్యర్థనలను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు దేవా, ప్రభాకర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, ఏఎంఓ కాగిత లక్ష్మణ్, సీఎంఓ సామల రమేష్, జీసీడీఓ శైలజ, ఏఎస్ఓ రామకృష్ణ, ఏసీజీఈ మందల రవీందర్‌రెడ్డి, సిబ్బంది సమ్మయ్య, శనిగరపు భద్రయ్య ఉన్నారు.

‘చుక్క నీరివ్వని చరిత్ర బీఆర్ఎస్‌ది’



కాటారం: మాట్లాడుతున్న రాజు

కాటారం: మంథని ప్రాంతంలో భారీ ప్రాజెక్ట్ కట్టి నీరు, ఇసుక దోచుకుపోయి ఇక్కడి ప్రజలకు చుక్క నీరు కూడా ఇవ్వని చరిత్ర బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకులది అని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్ట్ కృంగిపోయి అస్తవ్యస్తంగా ఉంటే అలాంటిది ఏమి లేదని కాంగ్రెస్ నాయకులు నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అనడం హాస్యాస్పదకం అన్నారు. ప్రాజెక్ట్ పేరిట టీఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కుమ్మరి అశోక్, డొంగిరి చిరంజీవి,డొంగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

‘మేడిగడ్డ పదిలమనడం హాస్యాస్పదం’

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ పదిలమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడడం హాస్యస్పదమని మహదేవపూర్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలని కాళేశ్వరం బరాజ్‌లు, పంపుహౌస్‌ల్లో ఎక్కడా నాణ్యత పాటించలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులపై వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు.

పెట్రోల్ పోసుకుని గృహిణి ఆత్మహత్య

- మంటలు అంటుకుని గాయాలపాలైన మృతురాలి కుమారుడు



పావని(ఫైల్)



గాయాలపాలైన బాబు

టేకుమట్ల: గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పంగిడిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన పావని(28) 2018లో మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన గూడెపు దేవేందర్‌రెడ్డిని వివాహం చేసుకుంది. పావనికి కొన్ని రోజులుగా అత్తామామతో గొడవల కారణంగా ఇంట్లో ఉన్న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కాగా, చికిత్స కోసం ఆమె కుటుంబ సభ్యులు 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలంలో రెండున్నరేళ్ల తన కొడుకుకు ఉండగా బాబుకు సైతం మంటలు అంటుకోగా గాయాలపాలయ్యాడు. బాబును ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. పావని ఆత్మహత్య సంఘటనపై ఎస్సై ప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. మంగళవారం ప్రధాన రహదారిపై వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్సు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఆయన వెంట పోలీసులు ఉన్నారు.